క్లుప్తంగా

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



అరబుపాలెంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: వరి సాగులో రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. గురువారం అరబుపాలెం రైతు సేవా కేంద్రంలో రాయితీపై రైతులకు వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌కు అవసరమైన విత్తనాలను అధికారులు అందుబాటులో ఉంచారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగి నాగేశ్వరరావు, దొడ్డి వెంకట సత్యనారాయణ, గంగాధర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు



నీలిగుంటలో చేతిబోరుకు మరమ్మతు చేస్తున్న మండల పరిషత్ బోరు మెకానిక్‌లు

కోటవురట్ల: నీలిగుంటలో మొరాయించిన చేతిబోరుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. చేతిబోరు పాడవ్వడంతో గ్రామస్తులు రెండు రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో పలువురు సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబుకు ఫిర్యాదు చేశారు. చర్యలు చేపట్టిన సర్పంచ్ మండల పరిషత్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గంగాలమ్మ గుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సూరి అప్పారావు, శ్రీను సోదరులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట పరిధిలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. మంగళవరపుపేటకు చెందిన సరిసా నాగబాబు–వీరలక్ష్మి దంపతుల కుమారులు సూరి అప్పారావు, శ్రీను గురువారం తమవంతు సాయంగా రూ.లక్ష విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



రోడ్డుమధ్య డివైడర్లపై చిక్కుకున్న లారీ

మాకవరపాలెం: డివైడర్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో భారీ ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండు సమీపంలో గురువారం ఉదయం నర్సీపట్నం వైపు వెళుతున్న లారీ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. అటుగా వెళుతూ ఒక్కసారిగా డివైడర్లపైకి దూసుకుపోయి మధ్యలో చిక్కుంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రధాని మోదీ సహకారంతో పరిశ్రమల రాక

పాయకరావుపేట: ప్రధాని మోదీ సహకారంతో అత్యధిక సంఖ్యలో పరిశ్రమలను పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకువచ్చానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. గురువారం పీఎల్ పురంలో జరిగిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువత ఉందని తెలుసుకుని, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకురావాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ త్వరలోనే ఏర్పాటు అవుతుందన్నారు. నక్కపల్లిలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అక్టోబర్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వికసిత భారత్ సంకల్ప సభల ద్వారా ప్రధాని 11 సంవత్సరాల పాలనలో దేశం ఏవిధంగా అభివృద్ధి చెందిందో వివరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వికసిత భారత్ 2047 ప్రతిజ్ఞను ఎంపీతో పాటు కూటమి నాయకులు, ప్రజలు చేశారు.

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. భూమిని దున్నటం ఎంత ముఖ్యమో శుద్ధి చేసి విత్తనం వాడడం అంతే ప్రధానం. ఏరువాక ప్రారంభమయ్యే సమయంలో రైతన్నలు విత్తన ఎంపికలో ఎంత జాగ్రత్త తీసుకుంటారో.. కొనుగోలు చేసిన విత్తనాలను శుద్ధి చేస్తే మేలైన పంట దిగుబడి సాధించొచ్చు. ఈ విత్తనశుద్ధిలో సరైన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలి. సరైన మందులతోనే జాగ్రత్తగా శుద్ధి చేయాలి. లేదంటే పశువులకు, మనుషులకు హాని కలిగే అవకాశం ఉంది.

విత్తనశుద్ధి.. దిగుబడి వృద్ధి



మునగపాకలో వరి నారుమడికి సిద్ధం చేసిన పొలం

- తెగుళ్ల బెడదకు ముందుగానే చెక్
- సరైన మోతాదులో మందులను వినియోగించాలి
- తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి

మునగపాక: ఆరుకాలం కష్టపడి పంటల సాగు చేపడుతున్నా ప్రకృతి విలయతాండవం, లేదా తెగుళ్ల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏటా ఎదుర్కొంటున్నారు. అందుకే వ్యవసాయంలో రాణించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

సుడోమోషన్‌తో విత్తన శుద్ధి ఇలా..

ప్రతి రైతు వరిసాగులో తెగుళ్ల బెడదను ఎదుర్కొంటున్నారు. ఈ తెగుళ్లను నివారించేందుకు విత్తనశుద్ధి కార్యక్రమం గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్నారు. విత్తనం అలాగే నేల స్వభావం ద్వారా



రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు విత్తనశుద్ధి దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. 30 కిలోల విత్తనంలో 250 గ్రాములు సుడోమోషన్‌ను, 90 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి ఊరిన తరువాత పంట పొలాల్లో జల్లాలి. గతంలో విత్తన శుద్ధి చేపట్టకుండా విత్తేవారు. దీంతో తెగుళ్ల బెడద నుంచి తేరుకోలేకపోయేవారు. విత్తన శుద్ధి ద్వారా వరిలో అగ్గి తెగులు, పొడ తెగులు నివారించవచ్చు.

నారుమడులు సిద్ధం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు వరి సాగుకు అవసరమైన పనులు మొదలుపెట్టారు. నారుమడులను దుక్కులతో సిద్ధం చేస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన పలువురు రైతులు వరి సాగుకు ఉపక్రమిస్తున్నారు. వరి సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించడం కష్టతరం కాదు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు పొందవచ్చు. నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చ రంగులో ఉంటే మొన త్వరగా తిరుగుతుంది. 4 నుంచి 6 ఆకులున్న నారును ఎంచుకోవాలి. పైపైన నాట్లు వేస్తే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. చదరపు మీటరుకు కనీసం 33 మొనలు ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున బాటలు ఏర్పాటు చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా పైరుకు గాలి, వెలుతురు తగిలి తెగుళ్ల బెడద తగ్గుతుంది. ఎరువులు వేసేందుకు, పురుగు మందులు, కలుపు మందులు పిచికారీ చేసేందుకు ఉపయోగకరంగా ఉంటాయి. నారుమడిలో లేత ఆకులు తెల్లబారినట్లు ఉంటే ఇనుప లోపంగా గుర్తించి నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నబేధి, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

విత్తన శుద్ధితో పంటకు రక్ష



వరిలో తెగుళ్ల బెడద లేకుండా ఉండేందుకు విత్తన శుద్ధి దోహదపడుతుంది. విత్తన శుద్ధి ద్వారా రైతుకు ఖర్చు కూడా తగ్గుతుంది. రైతులపై భారం లేకుండా ఉండేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో పలు రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉంచాం

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి, మునగపాక

దళిత నాయకుడు అప్పారావుకు పరామర్శ



ఆస్పత్రిలో అప్పారావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళిత నాయకుడు ఊసా అప్పారావును వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గురువారం పరామర్శించారు. భోగాపురం శివారు తట్టవానిపాలెం గ్రామానికి చెందిన అప్పారావు కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారు. ఆయనను పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాము, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, పార్టీ సీనియర్ నాయకుడు మారిశెట్టి సూర్యనారాయణ పరామర్శించి, ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

యలమంచిలి ఎంఈవో–1గా శ్రీనివాస్

యలమంచిలి రూరల్: మండల విద్యాశాఖాధికారి–1గా యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంఈవో–1గా పనిచేసిన వై.మీనాక్షి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం జిల్లాకు వెళ్లిపోయారు. ఆమె స్థానంలో ఎం.శ్రీనివాస్‌ను ఎఫ్ఏసీ ఎంఈవోగా పాఠశాల విద్య విశాఖపట్నం ఆర్జేడీ విజయభాస్కర్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

చప్పగా ఎస్.రాయవరం మండల సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న బొలిశెట్టి గోవిందు

ఎస్.రాయవరం: మండల సర్వసభ్య సమావేశం గురువారం చప్పగా సాగింది. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి అధికారులు మొక్కుబడిగా హాజరయ్యారు. యలమంచిలి ఎంపీడీవో కొండలరావు పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయాధికారి సౌజన్య పలు వివరాలు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన వరి విత్తనాలు రైతులందరికీ పంపిణీ చేయాలని వమ్మవరం ఎంపీటీసీ బాలం సూరిబాబు కోరారు. మొదటి విడతలో కొద్ది వచ్చాయని, రెండో విడతలో ఎక్కువగా తెప్పిస్తామని ఏవో బదులిచ్చారు. గ్రామంలో ఇంటికో బెల్టు షాపు ఏర్పాటు చేసి లైసెన్స్ దుకాణం నుంచి సరఫరా చేస్తుంటే పట్టించుకోరా; అని ఎక్సైజ్ అధికారులను పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఇలా పలువురు అధికారులు వెల్లడించిన నివేదికల తరువాత ఎంపీటీసీ, సర్పంచ్‌లు ముక్త కంఠంతో ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్, ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ మంజూరు చేస్తే నివేదికలు చదవాలని, కేవలం కూటమి నాయకులు, వారి మద్దతుదారులకే అందజేస్తున్నప్పుడు ఆ వివరాలు చదవద్దని సూచించారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక తెల్లమొహాలు వేసి కేటాయించిన కుర్చీల్లో కూర్చున్నారు. ఎంపీడీవో ఇన్‌చార్జ్ కావడంతో నోరు మెదపలేదు. తహసీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే వేగవంతంగా చేస్తున్నామని, 3 నెలల వ్యవధిలో పూర్తవుతుందని చెప్పారు. జెడ్పీటీసీ కాకర దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కాలం చెల్లిన గుడ్లు పంపిణీ జరుగుతుంటే ఆశాఖ అధికారులు ఏ చేస్తున్నారని ఈడీపీవోని ప్రశ్నించారు. ఇతర శాఖల అధికారులు రాకపోవడంతో సమావేశం ప్రారంభించిన గంట వ్యవధిలోనే ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు బొండా వెంకటలక్ష్మి, శానాపతి రాము, బైపా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కర్రి వెంకటరమణ, కోశెట్టి వెంకటరమణ, పాలపర్తి పాపారావు, మైలపల్లి శ్రీనివాసరావు, ఉద్దండం నాగశ్రీదేవి, కొప్పిశెట్టి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం



గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యులు

రావికమతం : కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలైన అజేయపురం, రాయిపాడులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. రాయిపాడు గ్రామంలో గల వైద్య శిబిరానికి 38 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. జ్వరాలు ఉన్న ఇద్దరికి రక్త పరీక్షలు చేసి సాధారణ జ్వరాలుగా నిర్ధారించారు. అజేయపురంలో 34 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. జ్వరాలు ఉన్న ఆరుగురికి రక్త పరీక్షలు చేయగా వారిలో ఒకరికి మలేరియా ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని వైద్యాధికారి మోహిని సురేఖ తెలిపారు. వారికి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



నక్కపల్లిలో యోగాసనాలు వేస్తున్న హాకీ విద్యార్థులు



రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

నక్కపల్లి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్కపల్లి మండలంలో ప్రోటోకాల్ యోగా కార్యక్రమాలు నెల రోజులుగా జరుగుతున్నాయి. సచివాలయ సిబ్బందికి, కార్యదర్శులు, వీఆర్వోలతో పాటు, ఏఎన్ఎంలు, అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందికి, పాఠశాలల్లో విద్యార్థులకు వారం రోజుల పాటు యోగాసనాలు నేర్పించారు. గురువారం నక్కపల్లి హాకీ మైదానంలో బీఎస్ హాకీ క్లబ్ విద్యార్థులకు, తైక్వాండో విద్యార్థులకు మాస్టర్ ట్రైనీ డి.రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు నేర్పించారు. యోగా అనేది జీవితంలో ఒక భాగమని ట్రైనీ తెలిపారు. యోగాతో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. పాఠశాలల్లో ప్రతి రోజు గంటపాటు విద్యార్థులతో యోగా చేయించాలని సూచించారు. శనివారం ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులతో పాటు, మాస్టర్ ట్రైనీలు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది విశాఖ ఆర్‌కే బీచ్‌లో జరిగే ప్రత్యేక యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

కోటవురట్ల: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని హెచ్‌ఎం ఆర్.నానిమణిమోహన్ తెలిపారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో యోగా సంసిద్ధతా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులతో యోగా చేయించి ఉపయోగాలను వివరించారు. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఓ దినచర్య కావాలన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థి దశ నుంచి యోగా తప్పనిసరి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి మంటలు



కె.కోటపాడు : కె.కోటపాడు పశువైద్య కేంద్రం, సీహెచ్‌సీ ప్రహరీ సమీపంలో గల విద్యుత్ స్తంభానికి గురువారం మంటలు వ్యాపించాయి. ఈ స్తంభాన్ని ఆనుకొని పిచ్చి మొక్కలు విస్తారంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే సమీప సీహెచ్‌సీలో గల వ్యర్థాలను, స్థానికులు చెత్తను వేస్తుంటారు. ఈ చెత్తకు ఉదయాన్ని నిప్పటించడంతో విద్యుత్ స్తంభానికి మంట వ్యాపించింది. సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందడంతో విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేసారు. దీంతో స్థానికులు మంటలను నీటితో అదుపు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో గల విద్యుత్ స్తంభానికి ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో పలువురు ఆందోళన చెందారు. వెంటనే విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేసి మంటలు అందుపు చేయడంతో పెనుప్రమాదం తప్పిందని పలువురు ఊపిరి పీల్చుకున్నారు.

7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎం. కోటపాడులో మాట్లాడుతున్న ఎలుసూరి గాటీలు

మాడుగుల రూరల్: వచ్చే నెల 7వ తేదీన ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఎం.ఎస్.పి. జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు మాదిగ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎం. కోటపాడులో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జిల్లా ఎంఆర్‌పీఎస్ ఎంయస్‌పి ఎంఈపి ఇన్‌చార్జి పోసపల్లి వెంకట్రావు మాదిగ సూచనల మేరకు వచ్చే నెల 7 వ తేదీన ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంద కృష్ణ మాదిగ కృషి వల్ల ఏబీసీ వర్గీకరణ అమలు కావడం, కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కడిత అప్పారావు, ఎంఆర్‌పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎలుసూరి అప్పారావు, మహిళా అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

కె.కోటపాడు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జూలై 7న కె.కోటపాడులో నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు అన్నారు. చౌడువాడలో గల ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో మాదిగ మహిళా నాయకురాలు అనిత, అనకాపల్లి రాజు, జీవరత్నం పాల్గొన్నారు.



చౌడువాడలో మాట్లాడుతున్న జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీనివాసరావు

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కార్మికులు ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నర్సీపట్నం : మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గొర్లి మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం మున్సిపల్ కార్మికులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఏపీసీఓఎస్ రద్దు చేస్తే కార్మికులందరిని పర్మనెంట్ చేయాలన్నారు. పర్మనెంట్ కార్మికుల వలే మాకు పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యూటీతో పాటు కనీస పింఛను రూ.10 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు మాకిరెడ్డి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర, వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిన్నారావు



నర్సీపట్నం : వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.చిన్నారావును నియమిస్తూ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతిక శుక్ల ఉత్తర్వులు జారీ చేశారు. జి.చిన్నారావు నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీస్ జేఎల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతిపై ఆయన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. పదోన్నతిపై వెళ్తున్న చిన్నారావుకు తోటి అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన

దేవరాపల్లి : సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అవగాహనతోనే ఈ వ్యాధి నిర్మూలన సాధ్యపడుతుందని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్యమేఘన అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై వైద్య సిబ్బందితో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు.

సికిల్ సెల్ ఎనీమియా వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహమని, రక్తంలో హెమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయన్నారు. ఈ వ్యాధి సంక్రమించిన వారిలో రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్ర ఒళ్లు, కాళ్ల నొప్పులు, శ్వాసకోశ సమస్యలు, అలసట, తరుచూ అంటు వ్యాధులు, గర్భాధారణ సమస్యలు, అవయవాల వైఫల్యం తదితర లక్షణాలు, సమస్యలు ఉత్పన్నమవుతాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో ఎం.ఆనంద్, ఏఎన్ఎంలు హైమా, ఆర్. సత్యవతి, జి.పుష్ప, శాంతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

కొఠంకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.30కి తగ్గింది. ఉల్లి, బంగాళదుంప ఇదే ధర ఉండగా, వంకాయ, బెండకాయ, క్యాబేజీ రూ.40, క్యారెట్, బీట్‌రూట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

అధికలోడుతో ఇక్కట్లు



ఎత్తులోడుతో వెళుతున్న గడ్డి ట్రాక్టరు

రోలుగుంట : ఎత్తులోడుతో ప్రమాదాలు, పరిమితి మించి లోడుతో వాహనాలు నడపడం నేరమని నిబంధనలున్నాయి. అయితే వాటిని అతిక్రమించే విధంగా కొంత మంది వాహనదారుల పరిస్థితి ఉంది. అధిక లోడుతో మలుపుల్లో వెళ్లలేక అదుపుతప్పి వాహనాలు బోల్తా పడిన సంఘటలు కూడా చోటు చేసుకున్నా వాహనాదారులు జాగ్రత్తలు పాటించడం లేదు. మండలంలో బీఎస్ రోడ్డుతో పాటు పక్క గ్రామాలకు వెళ్లే దారుల్లో ట్రాక్టర్లపై రైతులు పరిమితికి మించిన ఎత్తు లోడుతో గడ్డి ఒక ప్రాంతంలో కొనుగోలు చేసి మరొక గ్రామాలకు చేరవేస్తున్నారు. దీంతో వెనుక వాహనాలు వెళ్లే పరిస్థితి లేక ట్రాఫిక్ జామ్ అవుతోంది. మలుపు తిరిగే ప్రాంతాల్లో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వాహనాదారులకు అవగాహన కల్పించి, ఎత్తు లోడు రవాణాను నియంత్రించి, ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.